

పొద్దంతా రెక్కీ.. రాత్రంతా చోరీ

ఉన్నతస్థాయి వ్యక్తుల్లా పొద్దంతా కాలనీల్లో రెక్కీ నిర్వహించి ఏడుగురు సభ్యుల ముఠా రాత్రిపూట చోరీలకు పాల్పడుతోంది. ఎట్టకేలకు మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



నకిలీ విత్తనాలతో నష్టపోవద్దు

రైతులు నకిలీ విత్తనాలు సాగు చేసి నష్టపోవద్దని వ్యవసాయ అధికారులు సూచిస్తున్నారు. శనివారం జిల్లాలోని పలు మండలాల్లో రైతులకు విత్తనాలపై అవగాహన కల్పించారు. 9లో▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /29.0

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. వేడిగాలులు బలంగా వీస్తాయి. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. ఉక్కపోతగా ఉంటుంది.

గొర్రెల్లేవు.. డబ్బుల్లేవు..!



డీడీలు కట్టిన పేపర్లతో కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారులు



2022లో డీడీలు చెల్లించిన బ్యాంకు పేపర్లు

- రెండో విడత యూనిట్ల పంపిణీ ఉన్నట్లా.. లేనట్లా..?
- డీడీలు కట్టి రెండేళ్లుగా ఎదురుచూపులు
- అధికారుల చుట్టూ గొల్లకుర్మల ప్రదక్షిణ

మంచిర్యాలఅగ్రికల్చర్: 'అప్పులు తెచ్చి డీడీలు కట్టాం. రెండేళ్లు అవుతుంది.. గొర్రెల యూనిట్లు రాలేదు. కట్టిన పైసలకు వడ్డీ పెరుగుతోంది. డబ్బులైనా వాపస్ ఇవ్వండి.. వెంటనే గొర్లు అయినా ఇవ్వండి..' అంటూ గొల్లకుర్మలు కలెక్టరేట్ బాట పడుతున్నారు. రెండో విడత గొర్రెల పంపిణీ కోసం చెల్లించిన డీడీ డబ్బులు తిరిగి ఇవ్వాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. గత ప్రభుత్వం గొల్లకుర్మల ఆర్థికాభివృద్ధి కోసం అమలు చేసిన గొర్రెల పంపిణీ పథకం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం కొనసాగిస్తుందా.. లేదా.. అనే దానిపై స్పష్టత కొరవడింది. రాష్ట్ర ప్రభుత్వం మారడంతో లబ్ధిదారుల్లో పథకం అమలుపై అనుమానం ఉంది. జిల్లాలో మొదటి విడతలో 5,179మంది గొల్లకుర్మలకు గొర్రెల యూనిట్లు పంపిణీ చేశారు. లబ్ధిదారు వాటాగా రూ.31,250 చెల్లిస్తే రూ.1,25,000 విలువైన 20 గొర్రెలు, ఒక పొట్టేలును లబ్ధిదారులకు ఒక యూనిట్‌గా అందజేశారు. లబ్ధిదారులకు మేలు చేకూరడంతో రెండో విడత భారీ సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. 5,786మందికి గొర్రెల యూనిట్లు పంపిణీ చేయాలనే లక్ష్యంతో లబ్ధిదారులను ఎంపిక చేశారు. 2021 నుంచి గత ప్రభుత్వం గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం డీడీలు కట్టాలని కోరడంతో జిల్లాలో 1,700 మంది లబ్ధిదారులు డీడీలు కట్టారు. ఒక్కో యూనిట్ లబ్ధిదారుడి వాటాగా రూ.43,750 చెల్లిస్తే మిగతా సబ్సిడీ నగదు రూ.1,75,000 విలువైన గొర్రెలను ఇస్తుందని ప్రకటించారు. డీడీలు చెల్లించి రెండేళ్లు గడుస్తుండగా నేటికీ యూనిట్లు మంజూరు కాలేదు. గత ప్రభుత్వం ఎన్నికలకు ఏడాది ముందు నుంచే గొర్రెల పంపిణీపై స్పందించడం మానేసింది. అప్పట్లో పశు సంవర్థక శాఖ అధికారులు, గొర్రెలు కొనుగోలు చేసి ఇచ్చే ఏజెన్సీలు కుమ్మక్కై అక్రమాలకు పాల్పడడం, కొన్ని చోట్ల పట్టుబడడంతో యూనిట్ల పంపిణీ నిలిపివేశారు.

మారిన సర్కారు

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రెండో విడత గొర్రెల యూనిట్ల పంపిణీ కోసం లబ్ధిదారులు డీడీలుగా రూ.7,43,75,000 వరకు చెల్లించి ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఐదులు నెలలు కావొస్తోంది. గొర్రెల పంపిణీపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో లబ్ధిదారులు తాము చెల్లించిన డబ్బులకు వడ్డీ పెరిగిపోతోందని, తిరిగి ఇవ్వాలని సంబంధిత అధికారులపై ఒత్తిడి తెస్తున్నారు. మొన్నటి వరకు మండల పశువైద్యులను కలువగా.. ఇప్పుడు కలెక్టరేట్‌కు వచ్చి జిల్లా ఉన్నతాధికారుల వద్ద గోడు వెల్లబోసుకుంటున్నారు. మొదటి విడత గొర్రెల పంపిణీ యూనిట్లలో అనేక అక్రమాలు జరిగినట్లు కాగ్ తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. జిల్లాలో కూడా అనేక అక్రమాలు చోటు చేసుకున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం గొర్రెల పంపిణీ పథకం కొనసాగిస్తుందా లేదా అనేది తెలియడం లేదు.

అప్పులు చేసి డీడీలు కట్టాం...



రెండేళ్ల కిందట గొర్రెల యూనిట్ల కోసం అప్పులు చేసి రూ.43,750 డీడీ కట్టాం. ఇప్పటి వరకు గొర్రెలు ఇవ్వలేదు. మొదట కొంత మందికి అప్పుడు ఇచ్చిండ్రు మాకు మాత్రం ఇవ్వలేదు. తెచ్చిన అప్పుకు వడ్డీ పెరిగిపోతుంది. ఇటు గొర్రెలు వస్తలేవు. కట్టిన పైసలైన ఇవ్వాలని అడుగుతున్నాం.

– అన్నం సాయక్క, గ్రామం: చిన్నగూడిపేట్, మం: భీమిని

ఇంకెప్పుడు ఇస్తరు..



రెండో విడత గొర్రెల కోసం డీడీలు కట్టాలని మండల పశువుల డాక్టర్ చెబితే రూ.43,750 చొప్పున మా ఊర్లో గొల్లకుర్మలం మొత్తం 83 మంది కట్టినం. ఇంతవరకు గొర్రెలు ఇవ్వలేదు. రెండేళ్లు అవుతుంది.. ఎప్పుడు ఇస్తరని అడుగుతే మాకు ఫోన్ చేయద్దు నన్ను ఇబ్బంది పెట్టద్దని అంటున్నరు. గొర్రెలు ఇవ్వకుంటమానే పైసలన్న ఇవ్వమని అడుగుతున్నాం. ఎన్నికల కోడ్ ఉన్నది వచ్చే నెల 10 తర్వాత తెలుస్తది.. గొర్రెలు ఇచ్చేది పైసలు ఇచ్చేదని చెబుతున్నారు.

– ఒగ్గెర పర్వాతాలు, గ్రామం: చిన్నగూడిపేట్, మం: భీమిని

చెప్పులరిగేలా తిరుగుతున్నాం



గొర్రెలు ఇస్తరని ఆశతోని అప్పు చేసి బ్యాంకుల కట్టినం. మాకు గొర్రెల పెంపకం మీదనే ఆధారం. తెచ్చిన పైసలకు మిత్తీ పెరిగిపోతుంది కాని గొర్రెలు రాలేదు. ఇప్పుడు అప్పుడు అంటున్నరు. ఎలక్షన్లు అయిపోయిన ఇంకా ఇస్తలేరు. కలెక్టర్‌కు చెప్పుకుంటేనైన మా బాధ తెలుస్తుందని వచ్చినాం.

– ఎగ్గె పోషక్క చిన్నగూడిపేట్, భీమిని

ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాలేదు..

రెండో విడత గొర్రెల పంపిణీపై ఎలాంటి ఆదేశాలు రాలేదు. జిల్లాలో 1,700 మంది వరకు లబ్ధిదారులు డీడీలు చెల్లించి ఉన్నారు. ఎన్నికల కోడ్ అయిపోయిన తర్వాత ప్రభుత్వం నుంచి ఏదైనా ఆదేశాలు వస్తే దానికి అనుగుణంగా లబ్ధిదారులకు మేలు చేస్తాం.

– వై.రమేష్, జిల్లా పశుసంవర్థక శాఖ అధికారి

మోసం చేస్తే కఠిన చర్యలు

- తూకం, తరుగుపై పర్యవేక్షణ
- జిల్లాలో చివరి గింజ వరకు సేకరణ
- ఈ నెల 31వరకు కొనుగోళ్లు పూర్తి
- 'సాక్షి'తో జిల్లా అదనపు కలెక్టర్ ఎస్.మోతీలాల్



అడిషనల్ కలెక్టర్ మోతీలాల్

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: ధాన్యం కొనుగోళ్ల తూకంలో తేడాలు, తరుగు పేరుతో ధాన్యం కటింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతీలాల్ అన్నారు. తరుగు పేరుతో మిల్లర్ల ధాన్యం కటింగ్, లారీల కొరత, రవాణాలో జాప్యంపై ప్రతీ స్థాయిలో పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. రైతులెవరూ అధైర్యపడవద్దని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్న తీరుపై ఆయన శనివారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ధాన్యం సేకరణలో ఎదురవుతున్న పలు సమస్యలపై అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

కొందరు మిల్లర్లు ప్రతీ బస్తాకు కిలోకు పైగా అదనంగా ఇస్తేనే ధాన్యం దించుకుంటున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి.

ధాన్యం తరుగు పేరుతో అదనంగా ధాన్యం తీసుకునే మిల్లర్లపై కఠినంగా వ్యవహరిస్తున్నాం. ఎక్కడ ఫిర్యాదు వచ్చినా తక్షణం చర్యలు తీసుకుంటున్నాం. ఐకేపీ, మెప్మా, డీసీవో, డీసీఎంఎస్ నిర్వాహకులకు బస్తాకు 40కిలోలు, సంచి బరువు మొత్తం కలిపి 41కిలోల వరకే తీసుకోవాలని చెప్పాం. అంతకుమించి ఎక్కువ తీసుకుంటున్నారని ఫిర్యాదు వస్తే చర్యలు తీసుకుంటున్నాం.

చెన్నూరు మండలం దుగ్నేపల్లి కేంద్రంలో కాంటాలో తేడా ఉన్నట్లు గుర్తించారు? ఇలాంటి వాటిని ఎలా అరికడతారు?

కొనుగోళ్ల ప్రారంభానికి ముందే 286 కేంద్రాల పరిధిలో అన్ని కాంటాలను పరిశీలించాకే అనుమతి ఇచ్చాం. ఇటీవల దుగ్నేపల్లిలో కాంటాలో తేడాపై ఫిర్యాదు మేరకు తూనికలు, కొలతల అధికారులు తనిఖీ చేసి చర్యలు తీసుకోవాలని ఆదేశించాం. మరోసారి జరగకుండా అన్ని చోట్ల తనిఖీలు చేయాలని ఆదేశించాం.

లారీల కొరత, రవాణాలో జాప్యంతో వర్షం పడితే రైతులు ఇబ్బందులు పడుతున్నారు?

లారీల కొరత లేకుండా చూడాలని జిల్లాలో మూడు సెక్టార్ల రవాణా కాంట్రాక్టర్లకు రోజూ ఉదయాన్నే ఆదేశాలు ఇస్తున్నాం. జిల్లాలో 19మిల్లులు, పెద్దపల్లికి 45మిల్లులకు ధాన్యం కేటాయిస్తున్నాం. మిల్లర్లు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మండల పరిధిలోని రెవెన్యూ, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. ఎక్కడ సమస్య ఉన్నా పరిష్కారానికి కృషి చేస్తున్నాం.

ధాన్యం కొనుగోళ్లలో ట్రక్‌షీట్‌లో తేడాలు, ట్యాబ్ నమోదులో జాప్యంతో రైతులకు నష్టం జరుగుతోంది?

కొనుగోలు కేంద్రాలు, మిల్లర్లు ఇచ్చే ట్రక్‌షీట్‌పై తేడా ఉంటే రైతులు వెంటనే ఆ కేంద్ర నిర్వాహకులను ప్రశ్నించవచ్చు. ఇక ట్యాబ్ నమోదులో కొంత జాప్యం జరుగుతోంది. ధాన్యం మిల్లుకు చేరి అన్‌లోడ్ అయి రశీదు వచ్చి రైతుల మొబైల్‌కు ఓటీపీ వచ్చాకే నమోదు చేయాల్సి ఉంటుంది. కొంత జాప్యం జరుగుతున్నా సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని కోరుతున్నాం.

జిల్లాలో ధాన్యం కొనుగోళ్లు ఎప్పటి వరకు పూర్తి చేస్తారు?

జిల్లాలో 1.70లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ లక్ష్యం కాగా, ఇప్పటి వరకు 16,671మంది రైతుల నుంచి 1.11లక్షల మెట్రిక్ టన్నులపైగా ధాన్యం కొనుగోళ్లు చేశాం. ఇందులో 10.68లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు చేరింది. రూ.245.82కోట్లకు గాను రూ.140కోట్లు రైతులకు చెల్లించాం. ట్యాబ్ నమోదు పూర్తికాగానే మిగతా రైతులకు డబ్బులు జమవుతాయి. ఈ నెల 31లోపు ధాన్యం సేకరణ పూర్తి చేయాలనే లక్ష్యంతో ఉన్నాం.

న్యూస్‌రీల్

ఖైదీలు మంచి ప్రవర్తన కలిగి ఉండాలి



అవగాహన కల్పిస్తున్న జడ్జి శ్రీనివాసులు

లక్సెట్టిపేట: అండర్ ట్రయల్ ఖైదీలు మంచి ప్రవర్తన కలిగి ఉండాలని జిల్లా జడ్జి బోయ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని సబ్‌జైల్‌ను పరిశీలించి మాట్లాడారు. అండర్ ట్రయల్ ఖైదీలు జైలులో పరిశుభ్రతను పాటించాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో ఉండాలని తెలిపారు. ఖైదీలకు ఎలాంటి ఇబ్బందులున్నా తెలియజేయాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జైల్‌లోని మరుగుదొడ్లు, వంటగది, పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జైలర్ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

'రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటాం'

చెన్నూర్: అకాల వర్షానికి వరిధాన్యం దెబ్బతిని రైతులు ఇబ్బందులు పడుతున్నారని, రైతులను అన్ని విధాలుగా ఆదుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్‌వెంకటస్వామి అన్నారు. ఈ మేరకు శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. నియోజకవర్గంలో వరిధాన్యం కొనుగోలులో ఎలాంటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లా కలెక్టర్లతో మాట్లాడినట్లు తెలిపారు. రైస్‌మిల్లుల్లో, కేంద్ర ప్రభుత్వం గోడౌన్‌లను తక్కువ చేయడంతో లారీలు సక్రమంగా రావడం లేదని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతుల విషయంలో రాజకీయం చేస్తోందని విమర్శించారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ప్రతీ గింజను రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు.

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం

- బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వినోద్

బెల్లంపల్లి: బెల్లంపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే గడ్డం వినోద్ అన్నారు. శనివారం పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. మున్సిపల్ కౌన్సిలర్లు చిత్తశుద్ధితో పని చేయాలని, నిస్వార్థంగా పని చేస్తే ప్రజల ఆదరణ ఉంటుందని తెలిపారు. మరో ఆరు నెలల్లో గ్రామ పంచాయతీ, మున్సిపల్ ఎన్నికలు వచ్చే అవకాశాలు ఉన్నాయని, చిత్తశుద్ధితో పనిచేసే నాయకులకు గెలుపు అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఎలాంటి జాప్యం లేకుండా ధాన్యం కొనుగోలు చేపట్టాలని కలెక్టర్‌కు సూచించానని చెప్పారు. బెల్లంపల్లి మున్సిపల్ ప్రజలకు గోదావరి జలాల సరఫరాకు ప్రత్యేక పైపులైన్ కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. సింగరేణి సీఎండీతో మాట్లాడి బెల్లంపల్లి సింగరేణి ఏరియా ఆస్పత్రి సమస్యలు పరిష్కరిస్తానని హామీనిచ్చారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం తొలి విడతలో నియోజకవర్గానికి రెండు వేల ఇళ్లు, మలివిడతలో 1,500 ఇళ్లు మంజూరవుతాయని అన్నారు. ఈ సమావేశంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, మున్సిపల్ మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, టీపీసీసీ సభ్యుడు చిలుముల శంకర్, కాంగ్రెస్ ఎన్నికల ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు నాతరి స్వామి, ఐఎన్‌టీయూసీ సింగరేణి విభాగం కేంద్ర కమిటీ సభ్యుడు సిద్దంశెట్టి రాజమొగిలి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి రొడ్డ శారద, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

రైతులను దోచుకుంటున్న మిల్లర్లు

- బీజేపీ ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్



ఆస్నాదలో మాట్లాడుతున్న శ్రీనివాస్

చెన్నూర్‌రూరల్: మిల్లర్లు రైతుల నుంచి ఎక్కువ ధాన్యాన్ని దోచుకుంటున్నారని బీజేపీ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గోమాసే శ్రీనివాస్ విమర్శించారు. మండలంలోని ఆస్నాద గ్రామంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. ప్రభుత్వ సహకారంతోనే మిల్లర్లు రైతులను మిల్లుకు పిలిపించుకుని బలవంతంగా సంతకాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే వివేక్ రైతులను గాలికొదిలేసి విదేశాల్లో పర్యటిస్తున్నారని అన్నారు. రైతుల నుంచి అక్రమంగా పది కిలోల ధాన్యాన్ని ఎక్కువగా తూకం వేస్తున్నారని, ప్రశ్నించిన వారి ధాన్యాన్ని తరలించకుండా వదిలేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ పెద్దపల్లి పార్లమెంట్ కన్వీనర్ నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం అశోక్, ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్, చెన్నూర్ మండల అధ్యక్షుడు మోర్ల శంకర్, నాయకులు రాజశేఖర్, రాజబాపు, కొటారి వెంకటేశ్, ఆలం బాపు, రత్న వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలకు పరామర్శ

కాసిపేట: మండలంలోని నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దాగం మల్లేష్ మామ బోర్లకుంట భీమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా శనివారం సాయంత్రం గోమాసే శ్రీనివాస్ పరామర్శించారు. అనంతరం గోలేటి శశి తల్లి లక్ష్మి కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా కలిసి పరామర్శించారు. నేతకాని మహర్ హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్కూరి రాజ మౌళి, రాష్ట్ర నాయకులు జవ్వాజి తిరుపతి, దుర్గం ఎల్లయ్య, బానయ్య, గోగుల మదన్‌మోహన్, నాగరాజు, దూట రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అలసత్వం వద్దు



కన్నెపల్లిలో నర్సరీని పరిశీలిస్తున్న డీపీఓ

నెన్నెల/భీమిని: విధి నిర్వహణలో పంచాయతీ అధికారులు అలసత్వం ప్రదర్శించవద్దని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం ఆయన నెన్నెల, కన్నెపల్లి మండలాల్లో పర్యటించారు. నెన్నెలలోని శ్మశానవాటిక, డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతివనం, నర్సరీలు పరిశీలించారు. వాటిల్లో అన్ని వసతులు కల్పించడంతోపాటు గ్రామాల్లో ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందన్నారు. డంపింగ్‌యార్డు, శ్మశాన వాటికలను వినియోగంలోకి తీసుకు రావాలని అన్నారు. కన్నెపల్లి మండల కేంద్రంలో అభివృద్ధి పనులు, డంపింగ్‌యార్డు, శ్మశానవాటిక నర్సరీలు పరిశీలించారు. డంపింగ్‌యార్డుల్లో తడి, పొడి చెత్త వేరు చేసి కంపోస్టు ఎరువు తయారు చేయాలని తెలిపారు. ఎంపీఓ శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు సాగర్, అభిలాష్ పాల్గొన్నారు.

డీసీఎస్‌వోగా ఉమారాణి బాధ్యతల స్వీకరణ



టేకుమట్ల కొనుగోలు కేంద్రంలో డీసీఎస్‌వో ఉమారాణి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి(డీసీఎస్‌వో)గా ఉమారాణి శనివారం బాధ్యతలు స్వీకరించారు. వరంగల్ జిల్లాలో డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న ఆమెను శుక్రవారం జిల్లాకు బదిలీ చేశారు. ఇంతకు ముందు ఉన్న జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి వాజిద్ అలీని ఈ నెల 11న విధుల్లో నిర్లక్ష్యం వహిస్తున్నారని రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ డీఎస్ చౌహాన్ సస్పెండ్ చేశారు. దీంతో ఈ నెల 15న బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణకు ఇంచార్జి బాధ్యతలు అప్పగించారు. పది రోజుల వ్యవధిలోనే ఉమారాణిని రెగ్యులర్ డీసీఎస్‌వోగా నియమించగా జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. వెంటనే డీఎం గోపాల్‌తో కలిసి జిల్లాలోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణను పరిశీలించి నిర్వాహకులకు సూచనలు చేశారు. ఏమైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని రైతులను అడిగి తెలుసుకున్నారు. రైస్‌మిల్లును తనిఖీ చేసి సీఎంఆర్ వేగవంతం చేయాలని సూచించారు. ధాన్యం తరలింపు వేగవంతం చేస్తామని, రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతామని అన్నారు. డీసీఎస్‌వోను కార్యాలయ అధికారులు, సిబ్బంది, రేషన్ డీలర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు ఎం.సత్తయ్య, బి.సత్యనారాయణరెడ్డి, మహేందర్‌రెడ్డి, కృష్ణ పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన



భీమారం పాఠశాలలో పనులు పరిశీలిస్తున్న డీఈవో

భీమారం: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యతోపాటు మౌలిక సదుపాయాలు కల్పనకు ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలలు ఎంపిక చేసిందని జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య అన్నారు. శనివారం మండలంలోని ఆర్కెపల్లి, ఆరెపల్లి, తాళ్లగూడెం, భీమారం బీసీ కాలనీ పాఠశాలల్లో చేపట్టిన పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు నాణ్యమైన విద్యాబోధనకు నిలయాలుగా మారాయని అన్నారు. విద్యార్థులకు మంచినీరు, ఫ్యాన్లు, మరుగుదొడ్లు సదుపాయాలు కల్పిస్తే తల్లిదండ్రులకు పాఠశాలల పట్ల నమ్మకం పెరుగుతుందని తెలిపారు. పాఠశాలలు ప్రారంభమయ్యేలోపే విద్యార్థుల యూనిఫాం సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. యూనిఫాం కుట్టే పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్ అధికారి కే.చౌదరి, ఎంఈవో కొమ్మెర రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

క్లుప్తంగా

పురుగుల మందుతాగి ఆత్మహత్య


సురేశ్ (ఫైల్)

కోటపల్లి: పురుగుల మందుతాగి ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని పార్పల్లి గ్రామానికి చెందిన నామని సురేశ్ (42) కొంతకాలంగా మద్యానికి బానిసై ఏ పనీ చేయకుండా ఖాళీగా తిరుగుతుండేవాడు. శనివారం ఇంట్లో పురుగుల మందు తాగడంతో అతని భార్య రజిత గమనించి 108కు సమాచారం అందించింది. ముందుగా చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యంకోసం మంచిర్యాల ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించగా పరిస్థితి విషమించి మృతి చెందాడు. మృతునికి ఇద్దరు కూతుర్లు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై కాంతారావు తెలిపారు.

వృద్ధుడు ఆత్మహత్య

కౌటాల: ఉరేసుకుని వృద్ధుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్తంపేటకు చెందిన కారెం పెంటు (64) శనివారం మధ్యాహ్నం గ్రామ శివారులోని చెట్టుకు ఉరేసుకున్నాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్సై ఎన్.మధుకర్ సంఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం సిర్పూర్(టి)సామాజిక ఆస్పత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. వృద్ధుడి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

కోర్సినిలో ఒకరు దారుణహత్య

చింతలమానెపల్లి: చింతలమానెపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని కోర్సినిలో శుక్రవారం రాత్రి ఒకరు దారుణహత్యకు గురైనట్లు ఎస్సై నరేష్ తెలిపారు. గ్రామంలో కూలి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్న బొట్టుపల్లి సదయ్య (34) శుక్రవారం రాత్రి గ్రామంలోని ముల్కల రాజ్‌కుమార్ ఇంటికి వెళ్లగా ఇద్దరి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ఈక్రమంలో రాజ్‌కుమార్ ఇనుప పైపుతో తలపై కొట్టగా సదయ్యకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి బొట్టుపల్లి మల్లక్క ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బీసీలకు అవకాశం ఇవ్వాలి

పాతమంచిర్యాల: తెలంగాణ ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే యూనివర్సిటీ ఉపకులపతుల పోస్టులలో బీసీలకు అవకాశం కల్పించాలని జాతీయ బీసీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు గుమ్ముల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శనివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు వెంకటయ్య, మామిడిశెట్టి వెంకటేష్, రాజు, చంద్రమౌళి, సతీష్, రాజేశం, తదితరులు పాల్గొన్నారు.

ఇరువర్గాలపై కేసు

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని శ్రీషైన్ ఆస్పత్రి వద్ద శుక్రవారం రాత్రి ఫర్నీచర్ విషయంలో డాక్టర్ నవ్య, స్థానిక నివాసి శ్రీనివాస్ మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో ఎస్సైలు సోనియా, అంజన్న సంఘటన స్థలానికి చేరుకుని ఇరువర్గాలను అక్కడి నుంచి పంపించారు. డాక్టర్ నవ్యకు తలకు గాయం కావడంతో స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఇరువురి ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నామని రూరల్ సీఐ అల్లం రాంబాబు తెలిపారు.

కార్మికవాడలకు కలుషిత నీరు


రామాలయం ఫిల్టర్ బెడ్

- పట్టించుకోని సింగరేణి అధికారులు
- ఆందోళనలో కార్మిక కుటుంబాలు

బెల్లంపల్లి: పట్టణంలోని కార్మిక వాడలకు మౌలిక సదుపాయాల కల్పనలో చూపిస్తున్న నిర్లక్ష్యం తాగునీటి సరఫరాలోనూ కనిపిస్తోంది. ఫలితంగా ప్రతీ వేసవి సీజన్‌లో కార్మిక కుటుంబాలు తాగునీటి కష్టాలు అనుభవిస్తున్నాయి. నాలుగైదు రోజులకోసారి అతికష్టం మీద నీటిని వదులుతుండడంతో మెజార్టీ కార్మికవాడలు నీటిగోసను అనుభవిస్తున్నాయి. శుక్రవారం బొగ్గు, ఆయిల్‌తో ఉన్న నీటిని సరఫరా చేయడం కలకలం రేపింది. ఈ నీటిని మరుగుదొడ్లు, మూత్రశాలలకు వినియోగించడానికి తప్ప మరెందుకు పనికి రాదని కార్మికులు పేర్కొంటున్నారు. నల్లని రంగుతో సరఫరా అవుతున్న నీటిని కార్మిక కుటుంబాలు, కార్మికేతరులు తాగలేక గొంతు తడుపుకునేందుకు అనివార్యంగా వాటర్ క్యాన్లను కొనుగోలు చేసి అవసరాలు తీర్చుకునే పరిస్థితులు ఏర్పడ్డాయి. బెల్లంపల్లిలో బొగ్గు గనులు మూతబడి, విభాగాలు ఎత్తివేతకు గురికావడంతో పాటు ఎంపిక చేసిన ప్రాంతాల్లోని కంపెనీ క్వార్టర్లను, ఖాళీ స్థలాలను ప్రభుత్వానికి అప్పగించడంతో ఆయా అంశాల పట్ల సింగరేణి అధికారులు ఏమాత్రం శ్రద్ధ చూపడంలేదని తెలుస్తోంది.


కార్మికవాడలకు సరఫరా అయిన తాగునీరు

మొక్కుబడిగా శుద్ధిచేసి..

గోదావరి జలాలు ఆశాజనకంగా సరఫరా కాకపోవడంతో ప్రత్యామ్నాయంగా శాంతిఖని గని నీటిని సరఫరా చేయడానికి అధికారులు సిద్ధపడ్డారు. గని భూగర్భంలో యంత్రాల ద్వారా బొగ్గు ఉత్పత్తి జరుగుతోంది. యంత్రాలకు వినియోగించిన గ్రీస్, ఆయిల్ నీటిలో కలిసి పోతుంది. ఆ నీటిని భూగర్భం నుంచి ప్రత్యేక పైపులైన్ ద్వారా గని ఉపరితలానికి తీసుకువచ్చిన తర్వాత సమీపంలోనే ఉన్న శాంతిఖని ఫిల్టర్ బెడ్‌లో శుద్ధిచేసి సరఫరా చేయాల్సి ఉండగా ఈ తీరుగా వ్యవహరించడం లేదు. ఫిల్టర్ బెడ్‌ల పర్యవేక్షణ కూడా సరిగా చేపట్టడం లేదు. దీంతో సక్రమంగా నీటి శుద్ధిచేయకుండానే కార్మిక వాడలకు వదులుతున్నారు. ఆ నీటిని అనివార్యంగా కార్మికులు తాగాల్సిన దుస్థితి వస్తున్నా సింగరేణి కార్మిక సంఘాలు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగిన ఏఐటీయూసీ ఎర్ర జెండా సంఘం పోరాట పటిమను కోల్పోయి కార్మిక సమస్యలపై సరిగా స్పందించడం లేదనే విమర్శలను మూట గట్టుకుంటోంది. మిగిలిన ఐఎన్‌టీయూసీ, టీబీజీకేఎస్, ఇతర సంఘాలు పత్రికా ప్రకటనలకే పరిమితమవుతున్నాయని కార్మికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా ప్రధాన కార్మిక సంఘాలు తాగునీటి సమస్య పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయాన్ని 'సాక్షి' సింగరేణి సివిల్ విభాగం బెల్లంపల్లి ఇన్‌చార్జి సతీష్ దృష్టికి తీసుకెళ్లగా పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

గోదావరి నీళ్లు రావు.. వచ్చినా వదలరు

కార్మికవాడలకు గోదావరి జలాల సరఫరా సరిగా కానరావడం లేదు. సీసీసీ ఇంటెక్ వెల్ నుంచి మందమర్రి ఫిల్టర్ బెడ్‌కు గోదావరి నీటిని సరఫరా చేసి అక్కడ ఫిల్టర్ చేసిన తర్వాత బెల్లంపల్లికి సరఫరా చేయాల్సి ఉండగా సక్రమంగా అమలు చేయడం లేదు. మందమర్రిలోని కార్మిక వాడలకు మొదటి ప్రాధాన్యత ఇచ్చి అక్కడ పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరిగాక మిగిలిన కొద్దిపాటి నీటిని బెల్లంపల్లికి వదిలిపెడుతున్నట్లు చెబుతున్నారు. ఆ కొద్దిపాటి గోదావరి నీటిని స్టేషన్‌రోడ్ కాలనీ, అధికారులు నివాసం ఉంటున్న ఏఎంసీ ఏరియాలకు సరఫరా చేసి మిగతా ప్రాంతాలపై పక్షపాత వైఖరి అవలంభిస్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.

పొద్దంతా రెక్కీ.. రాత్రంతా చోరీ


వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్రీనివాసులు

- ఏడుగురు సభ్యులున్న దొంగల ముఠా అరెస్టు
- రూ.11.72 లక్షల విలువైన చోరీ సొత్తు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ శ్రీనివాసులు

మంచిర్యాలక్రైం: ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తుల్లా పొద్దంతా కాలనీల్లో సంచరిస్తూ రెక్కీ నిర్వహించడం, తాళం వేసి ఉన్న ఇళ్లనే టార్గెట్ చేస్తూ రాత్రి సమయంలో చోరీలకు పాల్పడుతున్న ఓ దొంగల ముఠాను ఎట్టకేలకూ మంచిర్యాల పోలీసులు పట్టుకున్నారు. రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాసులు స్థానిక ఎం.కన్వెన్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. జల్సాలకు అలవాటుపడి సులువుగా డబ్బులు సంపాదించాలన్న ఆలోచనతో ఏడుగురు ముఠాగా ఏర్పడ్డారు. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఇప్పటి వరకు జిల్లాలోని మంచిర్యాల, హాజీపూర్, సీసీసీ నస్పూర్, రామకృష్ణాపూర్, బెల్లంపల్లి, మందమర్రి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడుతున్నారు. చోరీ చేసిన సొత్తును శనివారం ముఠా సభ్యుడైన గన్నారం మధుకర్ ద్వారా కరీంనగర్‌లో విక్రయించేందుకు మరో సభ్యుడు స్థానిక గాంధీనగర్‌కు చెందిన తాటికొండ స్వామిచరణ్ ఇంటివద్ద సభ్యులంతా కలిసి సమావేశమయ్యారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించిన పోలీసులు వారిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ.9.22 లక్షల విలువైన బంగారు, రూ.60 వేల విలువైన వెండి ఆభరణాలు, బైక్, రూ.1.20 లక్షల విలువైన ఎల్‌ఈడీ హోంథియేటర్, రూ.20 వేల విలువైన గిటార్ స్వాధీనం చేసుకున్నారు.

అంతా 22 ఏళ్ల లోపువారే...

సీసీసీ ప్రశాంత్ నగర్‌కు చెందిన పాగిడి కార్తీక్ (19), జిల్లా కేంద్రంలోని గాంధీనగర్‌కు చెందిన తాటికొండ స్వామిచరణ్ (19), బెల్లంపల్లి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన పుప్పాల రాహుల్ (19), నస్పూర్ మండలం సుందరయ్య కాలనీకి చెందిన గన్నారం మధుకర్ (20), కుమురంభీం జిల్లా కాసిపేట మండలానికి చెందిన కుర్సింగ ఈశ్వర్ (20), తిర్యాణికి చెందిన మడావి రాము (22), తిర్యాణి మండలం కన్నెపెల్లికి చెందిన వెద్మ ప్రవీణ్(22)ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీపీ వెల్లడించారు. ముఠాను అరెస్టు చేయడంలో చాకచక్యంగా వ్యవహరించిన సీఐ బన్సీలాల్, సహకరించిన స్పెషల్ పార్టీ సిబ్బంది, ఎస్సైలను సీపీ అభినందించి నగదు రివార్డులు అందజేశారు. సమావేశంలో స్థానిక ఏసీపీ ప్రకాష్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్రూప్ 1, 2 గ్రాండ్ టెస్ట్

మంచిర్యాలఅర్బన్: పట్టణంలోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో ఈ నెల 26న గోల్కొండ అకాడమి ఆధ్వర్యంలో గ్రూప్ 1, 2 గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నట్లు నిర్వాహకుడు సైదులు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరుగుతుందని, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్షకు గంట ముందుగా హాజరై కళాశాలలో సత్యనారాయణను సంప్రదించాలని సూచించారు.

సమస్యలు పరిష్కరించాలని కార్మికుల నిరసన

కాసిపేట: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కాసిపేట-2 గని కార్యాలయం ఎదుట కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ నాయకులు మాట్లాడుతూ మ్యాన్‌రైడింగ్‌ను వెంటనే ప్రారంభించాలని, కొత్త ఎస్‌డీఎల్ యంత్రాలు తెప్పించాలని, మైనింగ్ సర్దార్‌లను నియమించాలని, గనిలో నార్త్‌లో వెంటిలేషన్ మెరుగుపర్చాలని, పర్మినెంట్ స్కావెంజర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. వీలైనంత త్వరగా సమస్యలు పరిష్కరిస్తామని గ్రూపు ఏజెంట్ రాందాస్, గని మేనేజర్ లక్ష్మీనారాయణ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ సెక్రెటరీ ఎండీ అక్బర్‌అలీ, బెల్లంపల్లి బ్రాంచి సెక్రెటరీ దాగం మల్లేశ్, ఉపాధ్యక్షుడు బియ్యాల వెంకటస్వామి, రామకృష్ణాపూర్ బ్రాంచి ఉపాధ్యక్షుడు లింగయ్య, పిట్ సెక్రెటరీ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న కార్మికులు

'రెస్ట్‌హాల్ ఏర్పాటు చేయాలి'

శ్రీరాంపూర్: ఏరియా వర్క్‌షాప్‌లో పనిచేస్తున్న మహిళా ఉద్యోగుల కోసం ప్రత్యేక రెస్ట్‌హాల్ ఏర్పాటు చేయాలని ఐఎన్‌టీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు డిమాండ్ చేశారు. శనివారం వర్క్‌షాప్‌ను సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీజీఎంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టాలని, వర్క్‌షాప్ డ్రైవర్లకు ప్లేడేలు కల్పించాలని, నాణ్యమైన పనిముట్లు అందుబాటులో ఉంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ఉపాధ్యక్షుడు కలవేన శ్యామ్, కార్యదర్శి బ్రహ్మచారి, ఏరియా కార్యదర్శులు వెంకటేశ్వర్లు, గణపతి, వెంకటస్వామి, నీలం సదయ్య, నాయకులు మోహన్, మహేష్, రామస్వామి, పిట్ సెక్రెటరీ రమేశ్, తదితరులు పాల్గొన్నారు.


కార్మికులలో మాట్లాడుతున్న జెట్టి శంకర్‌రావు

సేఫ్టీ సమావేశాన్ని బహిష్కరించిన ఏఐటీయూసీ

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సీహెచ్‌పీలో శనివారం అధికారులు నిర్వహించిన సేఫ్టీ సమావేశాన్ని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు బహిష్కరించారు. డీజీఎం వైఖరికి నిరసనగా ఆ యూనియన్ బ్రాంచి సహాయ కార్యదర్శి మోత్కూరి కొమురయ్య ఆధ్వర్యంలో నాయకులు సమావేశాన్ని బహిష్కరించి బయటికి వచ్చి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎస్పీలో రక్షణ సూత్రాలను పాటించడంలేదన్నారు. కార్మికులు రక్షణ ఏర్పాటు చేయాలని అడిగితే వారిపై అధికారులు, డీజీఎం కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. గత సేఫ్టీ సమావేశాల్లో సూచించిన అంశాలను, సమస్యలను పరిగణలోకి తీసుకోలేదని, అందుకే సమావేశాన్ని బహిష్కరించామన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా కార్యదర్శి ప్రసాద్ రెడ్డి, పిట్ సెక్రెటరీ చర్ల తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశాన్ని బహిష్కరించిన నేతలు

కమిషనర్‌పై చర్యలకు కలెక్టర్‌కు ఫిర్యాదు


కలెక్టరేట్‌కు వచ్చిన వీఆర్ఏ, వీఆర్వోలు

మంచిర్యాలఅగ్రికల్చర్: జాబ్ చార్ట్‌కు విరుద్ధంగా పనులు చేయిస్తున్న క్యాతన్‌పల్లి మున్సిపల్ కమిషనర్‌పై చర్యలు తీసుకోవాలని శనివారం వీర్వోలు, వీఆర్ఏలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. నాయకులు స్వామిదాస్, డి.శ్రీనివాస్ మాట్లాడుతూ వీఆర్వో, వీఆర్ఏలకు జూనియర్ అసిస్టెంట్ హోదా లేదా తత్సమానమైన హోదాతో పోస్టింగ్ ఆర్డర్లు ఇవ్వగా ఇందుకు విరుద్ధంగా స్వీపర్ పనులు చేయిస్తున్నారని వాపోయారు. వారం రోజులుగా ఉపాధి కూలీలు పనిచేసే హరితహారంకు సంబంధించిన పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

'ముస్లింలను ఓబీసీలో కలిపితే సహించేదిలేదు'

చెన్నూర్: పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ముస్లింలకు ఓబీసీ రిజర్వేషన్ కల్పిస్తానని ప్రకటించడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని బీజేపీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండపాక చారి అన్నారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో నాయకులు జాడి తిరుపతి, రాపర్తి వెంకటేశ్వర్, కమ్మల శ్రీనివాస్, గర్రెపల్లి నర్సయ్య, తుమ్మ శ్రీపాల్, శివకృష్ణ పాల్గొన్నారు.

చిన్నారికి రక్తమార్పిడి


శిశువుతో మధుసూదన్‌రెడ్డి

మంచిర్యాలటౌన్: జన్నారంలో చెత్తకుండీలో పడేసిన శిశువును బాలల సంరక్షణ అధికారులకు అప్పగించగా మంచిర్యాలలోని మాతాశిశు ఆరోగ్య కేంద్రానికి తరలించి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. చిన్నారి శరీరంలో రక్తం తక్కువగా ఉండడంతో ఉమెన్ అండ్ చైల్డ్ జిల్లా కోఆర్డినేటర్ ప్రేమ ద్వారా రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంకు ఇన్‌చార్జి మధుసూదన్‌రెడ్డి శిశువుకు అవసరమైన గ్రూప్ రక్తాన్ని ఉచితంగా అందజేశారు. రక్తమార్పిడి తర్వాత మాతాశిశు కేంద్రానికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు.

నకిలీ పత్తి విత్తనాలు స్వాధీనం


విత్తనాలు, నిందితుడితో ఏవో, పోలీసులు

నెన్నెల: మండలంలోని బొప్పారం స్టేజ్ వద్ద శనివారం 20 కిలోల నకిలీ పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నట్లు మండల వ్యవసాయాధికారి ప్రేమ్‌కుమార్ తెలిపారు. తమకు అందిన సమాచారం మేరకు వ్యవసాయ, పోలీసు సిబ్బందితో గ్రామంలో తనిఖీ కోసం వెళ్తుండగా బొప్పారం స్టేజీ వద్ద నారా పురుషోత్తం అనుమానాస్పదంగా కనిపించడంతో అతన్ని తనిఖీ చేయగా 20 కిలోల లూజ్ పత్తి విత్తనాలు లభించాయి. వాటిని స్వాధీనం చేసుకుని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు వివరించారు. దాడుల్లో పోలీసు సిబ్బంది అనంత్, హోంగార్డు రామరాజు, వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.

విద్యుత్‌కోతలతో దహన సంస్కారాలకు ఇక్కట్లు


'మిషన్' నీటితో స్నానం చేస్తున్న బంధువులు

భీమారం: మండల కేంద్రానికి చెందిన శంకరమ్మ అనే మహిళ శనివారం మృతి చెందగా భౌతిక కాయాన్ని గ్రామ పొలిమేరలోని అటవీ ప్రాంతానికి తరలించారు. సమీపంలోని రైతువేదిక వద్ద గల బోరుబావి ద్వారా నీటిని తరలించి కార్యక్రమం పూర్తి చేసేందుకు బంధువులు సిద్ధపడ్డారు. మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ శాఖ సిబ్బంది గ్రామానికి వెళ్లి మినరల్ వాటర్ కొనుగోలు చేసి తీసుకొచ్చి కార్యక్రమం పూర్తి చేశారు. అయితే మినరల్ వాటర్ అందకపోవడంతో గ్రామ పొలిమేరలో మిషన్ భగీరథ పంపువద్ద స్నానాలు ఆచరించారు.

సమస్యలు పరిష్కరించాలని సీఎండీకి వినతి

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర అధ్యక్షుడు డీ.బ్రహ్మానందం శనివారం సీఎండీ బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సింగరేణిలో కోల్ సెక్టార్ సిస్టం లేదా ఫ్యాక్టరీ యాక్ట్ సిస్టం పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడంతో కాంట్రాక్ట్ కార్మికులకు నష్టం జరుగుతుందన్నారు. చట్టబద్ధంగా రావాల్సిన హక్కులు, సౌకర్యాలు అమలు కావడం లేదన్నారు. హైపవర్ కమిటీ వేతనాలు అమలు చేయాలని, లీవులు, పండుగ మస్టర్లు. ఇతర అలవెన్స్‌లు కల్పించాలని, ఇంకా ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరారు.


వినతిపత్రం ఇస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నగల వ్యాపారులు ఒత్తిడికి గురికావొద్దు

పాతమంచిర్యాల: బంగారు నగల వ్యాపారులు ఎలాంటి ఆందోళన, ఒత్తిడికి గురికావొద్దని స్వర్ణకారుల సంఘం జిల్లా అధ్యక్షుడు బ్రహ్మయ్య అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని బీఎంఏ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దొంగ బంగారం కొనుగోలు చేసి ఇబ్బందులపాలు కావద్దన్నారు. యధావిధిగా దుకాణాలు తెరిచి పనులు చేసుకోవాలన్నారు. తమకు చట్టం అన్నా పోలీసులన్నా గౌరవం ఉందని, దొంగ బంగారం కొనుగోలు చేసినట్లు అనుమానం ఉంటే సీఆర్‌పీ 41 నోటీసులు జారీ చేసి విచారణకు పిలవాలన్నారు. స్వర్ణకారుల సమస్యలపై ముఖ్యమంత్రి, డీజీపీ, కేంద్ర మంత్రులను కలిసి విన్నవించనున్నట్లు తెలిపారు. సమావేశంలో స్వర్ణకారుల సంఘం రాష్ట్ర నాయకులు కన్నెకంటి సత్యం, ఎర్రోజు వేణుగోపాల్, వెంకటాచారి, నర్సింహాచారి, మంచిర్యాల బులియన్ మర్చంట్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా ప్రధాన కార్యదర్శి హన్మయ్య, పట్టణ ప్రధాన కార్యదర్శి శ్రీపాద రవి, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బ్రహ్మయ్య

మట్టి తవ్వకాలు అడ్డగింత

దండేపల్లి: మండలంలోని అల్లీపూర్ ఊర చెరువులో చేపట్టిన మట్టి తవ్వకాలను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువులో వెయ్యి మెట్రిక్ టన్నుల మట్టి తవ్వుకునేందుకు ఓ వ్యక్తి మైనింగ్, ఇరిగేషన్ శాఖల నుంచి అనుమతి పొందాడు. శుక్రవారం పూర్తి కావడంతో తవ్వకాలను నిలిపి వేయాలని సంబంధిత అధికారులు సూచించారు. అయినప్పటికీ తవ్వకాలు జరుపుతుండగా గ్రామస్తులు అడ్డుకుని అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ విషయమై ఇరిగేషన్ ఏఈ విజయభాస్కర్‌ను ఫోన్లో సంప్రదించగా అనుమతి ప్రకారం వెయ్యి మెట్రిక్ టన్నులు పూర్తి కావడంతో తవ్వకాలు నిలిపి వేయాలని సూచించామన్నారు.


తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

రైస్‌మిల్లును తనిఖీ చేసిన ఆర్డీవో

నెన్నెల: మండలంలోని నందులపల్లి గ్రామ శివారులో ఉన్న శ్రీలక్ష్మీ శ్రీనివాస రైస్‌మిల్లులో ధాన్యం దిగుమతి ప్రక్రియను శనివారం బెల్లంపల్లి ఆర్డీవో హరికృష్ణ తనిఖీ చేశారు. రైస్ మిల్లర్లు ధాన్యం అన్‌లోడింగ్ వేగవంతంగా పూర్తి చేయాలని, ధాన్యం రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని, మిల్లుల వద్ద ఎలాంటి కోత విధించకూడదని యాజమాన్యానికి సూచించారు. మిల్లులకు కేటాయించిన లక్ష్యాన్ని పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ సబ్బ రమేశ్, తదితరులు ఉన్నారు.


రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న ఆర్డీవో హరికృష్ణ

నమ్మించి దోపిడీ చేశారు..

కాగజ్‌నగర్ రూరల్: ఓ మహిళను మాయమాటలతో నమ్మించి దోపిడి చేసిన సంఘటన శనివారం రాత్రి కాగజ్‌నగర్‌లో చోటు చేసుకుంది. పట్టణంలోని పెద్దవాగు రోడ్డుకు చెందిన బిజిలి అచ్చమ్మ తన మనుమరాలు కీర్తనతో ఖమ్మం నుంచి శనివారం రాత్రి కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్‌కు వచ్చింది. వారిని గమనించిన ఇద్దరు దుండగులు మాటల్లో పెట్టి రైల్వేపట్టాలు దాటిస్తామని రైల్వే ఫుట్ ఓవర్ బ్రిడ్జి వరకు తీసుకెళ్లి దాడికి పాల్పడ్డారు. మహిళ మెడలోని రెండున్నర తులాల బంగారు చైన్, పర్సులోని రూ.6 వేల నగదు అపహరించారు. ఇద్దరూ గట్టిగా అరవడంతో పరారయ్యారు. రైల్వేశాఖ పోలీసులతో పాటు సీఐ శంకరయ్యకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు తెలిపింది.